కొన్ని బ్యాంకుల్లో దళారుల దందా నడుస్తున్నది. రైతుల అవసరాలను వారు ఆసరాగా చేసుకొని, అందినకాడికి దోచుకుంటున్నారు. అడిగేవారు లేకపోవడంతో అమాయక రైతులను మోసం చేసి క్యాష్ చేసుకుంటున్నారు. బ్యాంకుల్లో తీసుకున్న బంగారం, క్రాఫ్ లోన్లు తిరిగి చెల్లించేందుకు ఇబ్బందిపడుతున్న రైతుల రుణం మొత్తం వారే చెల్లించి, రూ.లక్షకు ఇంత చొప్పున కమీషన్ల వసూలు చేస్తున్నారు. గూడూరు మండల కేంద్రంలోని ఓ బ్యాంకులో ఈ కమీషన్ల దందా యథేచ్ఛగా సాగుతున్నది. రైతుల అవసరాలను గుర్తించడం.. వారి రుణం మొత్తం చెల్లించడం.. ముక్కుపిండి మరీ కమీషన్లు వసూలు చేయడం.. ప్రతి రోజూ వారికిదే బిజినెస్ కాగా, రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు.

– గూడూరు, జూన్ 15



రూ.లక్షకు 3 వేలు?

- బ్యాంకుల్లో దళారుల దందా
- రైతుల అవసరాలే ఆసరాగా నిలువు దోపిడీ
- బంగారం, క్రాఫ్‌లోన్లు చెల్లించి, కమీషన్లు వసూలు
- గూడూరు మండలకేంద్రంలోని ఓ బ్యాంకులో దళారుల హవా
- ఆర్థికంగా చితికిపోతున్న అన్నదాతలు

వ్యవసాయ సీజన్ రాగానే పంట పెట్టుబడికి రైతు కు డబ్బులు అవసరముంటాయి. ఈ క్రమం లో తమ భూములు, బంగారాన్ని బ్యాంకులో తనఖా పెట్టి రుణాలను తీసుకుంటారు. బ్యాంకు లో రుణం పొందాలంటే గతంలో తీసుకున్న రుణాలు చెల్లిస్తేనే తిరిగి బ్యాంకు అధికారులు రు ణం ఇస్తారు. ఇందు లో రెండు రకాలు ఉంటాయి. బంగారంపై రుణం తీసుకున్న రైతు తిరిగి రుణం పొందాలంటే ఇంతకుముందు తీసుకున్న రుణం, వడ్డీతో సహా చెల్లించి, బంగారాన్ని విడిపించాలి. మళ్లీ అదే బంగారాన్ని తనఖా పెడితే.., అప్పు డున్న ధర ప్రకారం నిబంధనల మేరకు రుణం ఇస్తారు. ఇక క్రాఫ్‌లోన్ కావాలంటే గతంలో తీసు కున్న రుణం వడ్డీతో సహా చెల్లించడంతోపాటు ఆ రైతు లావాదేవీలు మెరుగ్గా ఉంటే గతంలో కంటే ఎక్కువ మొత్తంలో రుణం పొందే అవకాశం ఉం టుంది. రైతు వద్ద మొత్తం డబ్బులు లేకపోతే కేవ లం వడ్డీ మాత్రం తీసుకొని మళ్లీ అదే ఖాతాపై గ తంలో తీసుకున్న రుణం మొత్తాన్ని రెన్యూవల్ చేస్తారు. కాగా, ఇక్కడే దళారులు ఎంటర్ అవు తారు. రైతు తాను తనఖా పెట్టిన బంగారం, తీసు కున్న క్రాఫ్‌లోన్లు విడిపించేందుకు ఇబ్బందిపడు తున్న రైతులను గుర్తిస్తారు. తామే బ్యాంకులో మొత్తం డబ్బు చెల్లిస్తామని అందుకు రూ.50వేల వరకు రూ.వెయ్యి నుంచి రూ.1500, రూ.60వేల నుంచి రూ.లక్ష వరకు రూ.2వేల నుంచి రూ.3 వేల వరకు కమిషన్ ఇవ్వాలని బేరమాడి, ఒప్పం దం చేసుకొని రైతులకు డబ్బులు చెల్లిస్తున్నారు. ఒకవేళ రైతుపై నమ్మకం లేకపోతే రైతుకు తెలిసిన వ్యక్తిని జమానత్‌గా తీసుకొని రైతులకు డబ్బులు ఇస్తున్నారు. ఇలా మండలకేంద్రంలో ఓ బ్యాంకు లో దళారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతున్నది. రైతులకు డబ్బులు చెల్లించి తిరిగి తమ డబ్బులు తాము పొందేందుకు దళారులు నిరంతరం బ్యాంకులోనే ఉంటున్నారు. ఏకంగా వీరు బ్యాంకు ఉద్యోగుల క్యాబిన్‌లోపలికి కూడా వెళ్లి పనులను చక్కబెట్టుకుంటున్నారని పలువురు ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. క్యూలైన్లలో నిల బడిన ఖాతాదారులకు సకాలంలో సేవలు అంద డంలేదని, దళారుల పని తొందరగా అవుతున్న దని వాపోతున్నారు. కాగా, దళారులు తాము డబ్బులు ఇచ్చిన రైతుల వద్ద విత్ డ్రా వోచర్లను ముందుగానే తీసుకొని రైతు బ్యాంకు ఖాతాలో డబ్బులు పడగానే దగ్గరుండి విడిపించుకొని వెంటనే కమీషన్ తీసుకుంటున్నారు. కొంతమంది దళారులు రైతు ద్వారా విత్‌డ్రా వోచర్ రాయించు కొని నేరుగా తమ ఖాతాకు జమ చేయించుకుం టున్నారు. ఇలా రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు ఎక్కువ మొత్తంలో కమీషన్లు తీసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. దళారుల వల్ల తాము ఎక్కువగా నష్టపో తున్నామని, వ్యవసాయ సీజన్‌లో రైతులకు మేలు చేసేలా ప్రభుత్వం కొన్ని నిబంధనలు సడలించా లని రైతులు కోరుతున్నారు. గతంలో వడ్డీలు చెల్లించి రెన్యూవల్ చేసుకొనే వారమని, ఇప్పుడు కూడా క్రాఫ్‌లోన్, బంగారం రుణాలపై కేవలం వడ్డీలు చెల్లిస్తే, తిరిగి తమ రుణాలను రెన్యూవల్ చేసి, అవసరమున్న మేరకు అదనంగా రుణం ఇచ్చేలా ప్రభుత్వం నిబంధనలు మార్చి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

- మానేరు, అటవీ వాగులు లూటీ
- నిబంధనలకు పాతర జోరుగా అక్రమ రవాణా
- ఇటీవల పెరిగిన దందా
- సర్కారు ఆదాయానికి గండి

కాల్వపల్లి – భూపాలపల్లికి తరలిస్తున్న ఇసుక

ఇసుక తోడేళ్లు..

అనుమతి పేరుతో అదనపు దోపిడీ

అనుమతి పేరుతో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. భూపాలపల్లి జిల్లా సరిహద్దుల్లోని మానేరు సహా అనుమతి లేని వాగుల నుంచి దర్జాగా తోడేస్తున్నా అడిగేవారు లేకపోవడంతో అడ్డూఅదుపు లేకుండా జోరుగా దందా నడుస్తోంది. నిబంధనలకు పాతరేసి వాగులను లూటీ చేస్తున్నా రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు ఒక్క కేసూ నమోదు చేయకపోగా ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ అవసరాల కోసమంటూ సాకులు చెబుతూ తప్పించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఎలాంటి నిర్మాణాలు జరుగకపోయినా పట్టపగలే వందల సంఖ్యలో ట్రాక్టర్లలో కమర్షియల్ నిర్మాణాలకు ఇసుక తరలిపోతున్నది. అయితే ట్రిప్పు లెక్కన రేట్ ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నట్లు ట్రాక్టర్ల యజమానులే బహిరంగంగా చెబుతుండడం దోపిడీ తీరుకు అద్దంపడుతుండగా, అధికారుల వైఖరితో సర్కారు ఆదాయానికి గండి పడుతోంది.

- జయశంకర్ భూపాలపల్లి, జూన్ 15(నమస్తే తెలంగాణ)

కమర్షియల్ అవసరాల కోసం ప్రభుత్వ క్వారీల నుంచి ఇసుక తీసుకోవాలనే నిబంధన ఇక్కడ బుట్ట దాఖలవుతోంది. కమర్షియల్ నిర్మాణాలకు సైతం మానేరు, కాల్వపల్లి క్వారీ ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ డంప్ చేసుకుని తరలిస్తున్నారు. ఇందుకోసం ఆయా అధికార యంత్రాంగానికి చేతులు తడుపాల్సి వస్తుందని తెలుపుతూ ఇసుక రవాణాదారులు చార్జీలు పెంచేస్తున్నారని వినియోగదారులు చెబుతున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుక ట్రిప్పుకు రూ.5వేలు వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. ఇదేమని అడిగితే ఇందులో నుంచి చాలామందికి ముట్టజెప్పాలంటున్నారని వినియోగదారులు వాపోతున్నారు.

ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ పనులకే : ఆర్డీవో

ఇసుక అక్రమ రవాణాను ఉపేక్షించేది లేదు. ఇందిరమ్మ ఇండ్లకు, ప్రభుత్వ పనులకు మాత్రమే ఇసుకను ఉచితంగా అందిస్తున్నాం. ఇసుకను కమర్షియల్‌గా రవాణా చేస్తే ఊరుకోం. సిబ్బందితో నిరంతరం పర్యవేక్షిస్తాం. అక్రమ రవాణా జరిగినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం.

జిల్లాకేంద్రానికే తరలింపు

ఇసుక ముఖ్యంగా జిల్లాకేంద్రంలో జరుగుతున్న కమర్షియల్ నిర్మాణాలకే తరలిపోతోంది. గోదావరి ఇసుకను ఈ నిర్మాణాలకు వినియోగించుకోవాల్సి ఉండగా అంతే నాణ్యతతో ఉన్న మానేరు, కాల్వపల్లి వాగుల్లోని ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రతిరోజూ చిట్యాల మండలంలోని కాల్వపల్లి ఇసుక ట్రాక్టర్ల ద్వారా నాన్‌స్టాప్‌గా భూపాలపల్లికి రవాణా అవుతోంది. ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ నిర్మాణాల పేరిట పట్టణంలోని పలు కాలనీలకు దర్జాగా రవాణా చేస్తున్నారు. గతంలో అక్రమ రవాణా చేయాలంటే ట్రాక్టర్ యజమానులు భయపడేవారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ అవసరాలకు అనుమతి ఇవ్వడంతో అక్రమ రవాణాకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. అలాగే అటవీ శాఖ పరిధిలోని దూదేకులపల్లి పెద్దవాగు, బొగ్గులవాగు, కాశింపల్లి చెలిమెల వాగు, తీగలవాగు, మోరంచపల్లి వాగు, గద్దెకుంటవాగు, చిట్యాల మండలం కాల్వపల్లి వాగు నుంచి ప్రతిరోజు ట్రాక్టర్లలో జోరుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది.

భూపాలపల్లి పట్టణంలో తరలిస్తున్న కాల్వపల్లి ఇసుక

ఒక్కో ట్రాక్టర్‌కు అటవీ శాఖ అధికారులు రూ.10వేలు నెలకు వసూలు చేస్తున్నట్లు ట్రాక్టర్ యజమానులే చెప్పుకోవడం గమనార్హం. భూపాలపల్లిలో మొత్తం 150 ట్రాక్టర్లు ఉండగా ప్రస్తుతం 50 ట్రాక్టర్లు మాత్రమే నడుస్తున్నాయి. టేకుమట్ల మండలం సమీప మానేరు వాగు నుంచి ఇసుక రాత్రివేళల్లో రవాణా అవుతోంది. ఈ క్రమంలో ఇసుక లారీలను, ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుంటున్నా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. ఇప్పుడు లారీలకు బదులు ట్రాక్టర్లలో రవాణా చేస్తున్నారు. భూపాలపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు జరుగకపోయినా రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుక రవాణా చేస్తున్నాయి.

'పచ్చ'ని ప్రయాణం

పచ్చని చెట్లతో 'హరిత'దారులు కనువిందు చేస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారంలో భాగంగా దారికి ఇరువైపులా నాటిన మొక్కలు నేడు ఏపుగా పెరిగి పచ్చని పందిరిలా మారి ఆహ్లాదం పంచుతున్నాయి. శాయంపేట మండలంలోని ప్రగతిసింగారం గ్రామానికి వెళ్లే దారిలో హరితహారం చెట్లు ప్రయాణికులకు పచ్చందాలు పంచుతున్నాయి. అలాగే కొత్తగట్టుసింగారం - మాందారిపేట జాతీయ రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలు పెరిగి పచ్చని దారులుగా మారాయి. రంగురంగుల పూలతో చూడముచ్చటగా హైవే వృక్షాలు హరిత తోటగా హాయినిస్తున్నాయి. ఎర్రని పూలతో వనంలా మారి ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి.

- శాయంపేట, జూన్ 15

గాలికి ఇలా.. పడితే ఎలా?

ప్రమాదకరంగా సంపద వనాల ఆర్చి గేట్

మేడిగడ్డ బరాజ్ సమీపంలో బీఆర్ఎస్ సర్కార్ తీరొక్క మొక్కలతో దశాబ్ది సంపద వనాలను ఏర్పాటు చేసింది. మొక్కలు నాటి ఆర్చి గేట్ నెలకొల్పింది. కాగా, ఈదురు గాలులకు బోర్డు రోడ్డు పైకి వంగి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలిపోతుందోనని ఆ దారిన వెళ్లేవారు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి దానిని సరిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– మహదేవపూర్, జూన్ 15



రెండేళ్లుగా కొనసాగుతున్న ములుగు సమీకృత కలెక్టరేట్ నిర్మాణం

పర్యవేక్షణ లోపం.. పనుల్లో జాప్యం

ములుగు జిల్లా పరిపాలనకు కేంద్ర బిందువైన సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులు సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువై ఆలస్యమవుతున్నాయి. ఫలితంగా రెండేళ్లుగా ఆగుతూ.. సాగుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణ పనులు వేగంగా కొనసాగినప్పటికీ ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు బిల్లుల చెల్లింపులో జాప్యం చేయడంతో నెమ్మదించాయి. 80 శాతం పనులు పూర్తి కాగా, వచ్చే దసరా పండుగ వరకైనా పూర్తవుతాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

– ములుగు, జూన్15(నమస్తే తెలంగాణ)

- దసరా నాటికి పూర్తయ్యేనా?
- అధికారుల నిర్లక్ష్యంతో పనుల్లో జాప్యం

ములుగు జిల్లాలో సమీకృత కలెక్టరేట్ నిర్మాణం కోసం గత బీఆర్ఎస్ సర్కారు రూ. 65కోట్లు మంజూరు చేసింది. అప్పటి జిల్లా యంత్రాంగం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన ఉన్న ఐదెకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించింది. 2022, జూన్ 7వ తేదీన కలెక్టరేట్ నిర్మాణ పనులకు అప్పటి మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీ, దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌లు శంకుస్థాపన చేశారు. అప్పుడు ఏడాదిలో పనులు పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినప్పటికి ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో బిల్లుల చెల్లింపు విషయంలో ఆలస్యం కారణంగా పనులు సాగుతున్నట్లు తెలుస్తున్నది. పనులు పర్యవేక్షించాల్సిన ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో కూడా కలెక్టరేట్ నిర్మాణ పనులు ఆలస్యమవుతున్నాయి.

దసరా వరకైనా పనులు పూర్తయ్యేనా?

2022లో పనులు శంకుస్థాపన చేసినప్పుడు సమీకృత కలెక్టరేట్‌ను 2023 దసరా పండుగ వరకు పూర్తి చేయాలని నిర్దేశించుకున్నారు. రెండేళ్లుగా కొనసాగుతున్న పనులు ప్రస్తుతం 80 శాతం మేర పూర్తయ్యాయి. వచ్చే దసరా పండుగ వరకైనా పనులు పూర్తవుతాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జీ ప్లస్ 2లో నిర్మిస్తున్న కలెక్టరేట్‌లో రెండు అంతస్తుల్లో పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ప్లాస్టరింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, పుట్టి, ఫాల్ సీలింగ్ పనులు జరుగుతున్నాయి. కలెక్టరేట్ చుట్టూ ప్రహరీ నిర్మాణం కొనసాగుతుండగా మెయిన్ గేటు వద్ద ఆర్చీ నిర్మాణ పనులు నడుస్తున్నాయి. కలెక్టరేట్ పక్కన సిబ్బంది కోసం నిర్మిస్తున్న రెండు భవనాల పనులు ఇంకా 50 శాతం కూడా పూర్తి కాలేదు. 100 శాతం భవన, ప్రహరీ నిర్మాణ పనులు, గార్డెనింగ్, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వ్యవస్థ పనులు పూర్తి కావాలంటే మరి కొన్ని నెలల సమయం పడుతుందని ఇంజినీరింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

కొనసాగుతున్న సమీకృత కలెక్టరేట్ పనులు

రోడ్డు భవనాల శాఖలో పూర్తిస్థాయి ఈఈ అధికారి లేక డీఈ అధికారి అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండడంతో నిర్మాణ పనుల్లో పర్యవేక్షణ లేకపోవడంతో పనులు ఆలస్యంగా జరుగుతున్నట్లు తెలుస్తున్నది. పనుల జాప్యం విషయమై అర్అండ్‌బీ ఇన్‌చార్జి ఈఈని ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. కార్యాలయానికి వెళ్లినా ఉండకపోవడంతో పాటు కిందిస్థాయి సిబ్బంది చెప్పే సమాధానాలు పొంతన కుదరడం లేదు. జిల్లా కలెక్టర్ స్పందించి సదరు అధికారిపై చర్యలు తీసుకోవడంతో పాటు సమీకృత పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మోహన్‌రావు భౌతికకాయం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

దొడ్డ సేవలు అజరామరం

- అభివృద్ధి ప్రదాత మోహన్‌రావు మృతి తీరని లోటు
- 'మిషన్ కాకతీయ' కోసం మొదటి విరాళ మిచ్చిన గొప్ప వ్యక్తి
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దిగ్భ్రాంతి

నర్సంపేట, జూన్ 15 : దొడ్డ మోహన్‌రావు సేవలు అజరామరమని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, సామాజిక సేవాతత్పరుడు, నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత దొడ్డ మోహన్‌రావు హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం గుండెపోటుతో మృతిచెందడంపై పెద్ది తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. అనంతరం హుటాహుటిన మోహన్‌రావు ఇంటికి చేరకుని ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సంపేట నియోజకవర్గానికి దొడ్డ చేసిన సేవలను గుర్తుచేస్తూ ప్రకటన విడుదల చేశారు. ప్రధానంగా నియోజకవర్గంలోని తను పుట్టిన గ్రామమైన చెన్నారావుపేట మండలం లింగగిరి అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. నర్సంపేటలో జిల్లా ఆస్పత్రి భవనం కోసం తన 20 ఎకరాల భూమిని ఇచ్చారన్నారు. మిషన్ కాకతీయ లాంటి బృహత్తరమైన కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్రంలోనే మొదటి విరాళం అందించిన గొప్ప దాత మోహన్‌రావు అని పేర్కొన్నారు. మాధన్నపేట లాంటి ఎన్నో గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేశారన్నారు. ప్రధానంగా నిరుపేదలను అక్కున చేర్చుకొని, వారి ఆలనాపాలనా చూసుకోవడానికి అనాథాశ్రమం ఏర్పాటు చేసి అభాగ్యులకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు అనాథ పిల్లలకు అన్నీ తానై వివాహాలు జరిపించిన ఆయన ఓ శక్తి అని కొనియాడారు. దొడ్డ మృతి నియోజకవర్గానికి తీరని లోటని, ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ నాగజ్యోతి డిమాండ్

తాడ్వాయి, జూన్ 15 : ప్రభుత్వ పథకాల అమలులో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న అక్రమాలను అరికట్టాలని బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం నార్లాపూర్‌లో ఆదివారం ఆమె గ్రామస్తులతో కలిసి భారీ ర్యాలీ చేపట్టి రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ.. మంత్రి సీతక్క ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలో ఉన్నప్పుడు మరోమాట మాట్లాడుతున్నదన్నారు. మాట ఇచ్చి తప్పడమే కాంగ్రెస్ పార్టీ నైజమని, ప్రజాపాలన అని చెబుతూనే పేదలకు తీరని అన్యాయం చేస్తున్నదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో జిల్లా వ్యాప్తంగా జరిగిన అవినీతి, అక్రమాలను అరికట్టాలన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, రైతులకు సకాలంలో రైతుభరోసా చెల్లించిన సన్న ధాన్యం బోనస్ డబ్బులను ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డబ్బులు ఇచ్చినోళ్లకే ఇందిరమ్మ ఇండ్లు కట్టబెట్టారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటర్లను మభ్యపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో పేదలకు జరిగిన అన్యాయంపై నిలదీస్తామని నాగజ్యోతి హెచ్చరించారు. కార్యక్రమంలో మేడారం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కాక లింగయ్య, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోవిందనాయక్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండలాధ్యక్షుడు దండుగుల మల్లయ్య పాల్గొన్నారు.

నార్లాపూర్‌లో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న బడే నాగజ్యోతి

బరాజ్ వద్ద భద్రత చర్యలేవీ?

కలెక్టర్ ఆదేశించినా కానరాని గస్తీ, హెచ్చరిక బోర్డులు

మేడిగడ్డ (లక్ష్మి) బరాజ్ గోదావరి పరివాహ ప్రాంతంలో ప్రమాద హెచ్చరికలు, సూచిక బోర్డులు కరువయ్యాయి. ఈ నెల 7న గోదావరి నదిలో గ్రామానికి చెందిన ఆరుగురు విద్యార్థులు ఈతకోసం వెళ్లి గల్లంతై మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అదే రోజు గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఈత కొట్టడం, ఫొటోలు, వీడియోలు తీయడంపై నిషేధం విధించినట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ టీఎస్ దివాకర ఆదేశాలు జారీ చేసి, గోదావరి పరివాహక ప్రాంతాల్లో పటిష్ట గస్తీ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కానీ, అధికారులు ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మేడిగడ్డ బరాజ్‌కు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. బరాజ్ వద్ద సెక్యూరిటీ, సరైన సమాచారంతో కూడిన సూచిక బోర్డులు లేకపోవడంతో మళ్లీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బరాజ్‌తో పాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- మహదేవపూర్, జూన్ 15